


# ప్రతిఫలం

రైలు పరుగెడుతూంది. చుట్టూ పొలాలు, చెట్లు, ప్రకృతి, రమణీయ దృశ్యాలు వెనక్కు పరుగెడు తున్నట్టు న్నాయి. ఆహ్లాదంగా ఉంది. గాలి రివ్వున వీస్తూంది. వింటర్.

ఫస్ట్ క్లాస్ కంపార్టుమెంటులో కూర్చున్న దుష్యంత్ గ్లాస్ డోర్స్ తెరిచాడు. అంత చలిగాలి అతన్ని బాధించలేదు. ఒడిలో 'స్టైక్స్' పత్రిక ఉంది. ఏవో ఇంగ్లీష్ నవల్స్ లెదర్ బాగ్ పక్కన ఉన్నాయి. చదవ బుద్ధేయలేదు. మనసంతా చిరాగ్గా ఉంది. పత్రిక మూసి బెర్త్‌మీద పెట్టాడు. కిటికీగుండా, బయటకు చూస్తూ ఆలోచనల్లో మునిగాడు.

ఆ రోజులు మరి రమ్మన్నా రావు. బంగారు దినా లవి. జీవితం మళ్ళీ పునరావృత్తం అవుతుందా? అనుకున్నాడు. అవును. బాల్యంలో, స్కూల్లో, కాలేజీలో చదువుకున్న రోజులు మరి వస్తాయా? ఎంతో ఆనందంగా గడిపిన రోజు లవి. తాను ఇప్పుడు డివిజనల్ ఇంజనీరు, ఫోన్సులో, టెలికమ్యూనికేషన్స్. బి. ఎస్‌సి. పాసై, మూడేళ్ళ ఇంజనీరింగ్ పాసై డైరెక్ట్‌గా రిక్రూయిట్ అయ్యాడు. బాగా పనిచేస్తాడని పేరు తెచ్చుకున్నాడు. కాని, కాలేజీలో తను గడిపిన రోజులు తనను కదిలించి వేస్తాయి. రాంబాబు దగ్గరికే తను వెడుతున్నది. ప్రాణ స్నేహితుడు. తనను చూడగానే ఉక్కిరి బిక్కిరవుతాడు. బొంబాయిలో బాంక్‌లో అకౌంటెంట్‌గా ఉన్నాడు. ఇద్దరూ కలిసి బి. ఎస్‌సి. చదివారు. అతడు ఎమ్. ఎస్‌సి.కి, తాను బి. ఇ కి వెళ్ళాడు. ఇద్దరూ బి. ఎస్‌సి. ఫస్టియర్లో క్లాస్‌మేట్స్ అయారు. ఇద్దరికీ మనస్పర్థ లొచ్చాయి ఒక విషయంలో. అది. . .



చర్చి (మెదక్)
ఫొటో— కె. శ్రీరాములు (హైదరాబాదు)

ఒక రోజు రాంబాబు, తను చదువుకుంటున్నారు. అమ్మాయిల మీద చర్చ వచ్చింది. "ధర్మవతి చాలా బాగుంటుంది. ఎంత అందంగా ఉంటుంది! నేను,ఆమె క్లాస్‌మేట్స్‌మి. మా స్కూల్లో హైస్కూల్ బ్యూటీ ఆమె. ఎవ్వరూగా ఏ లేడీకూడా 'బ్యూటీ' అని పేరు తెచ్చుకుంది?" అన్నాడు తను. ఆమె కూడా బి. ఎస్‌సి. ఫస్టియర్, విమెన్స్ కాలేజీలో. ధర్మవతి, తను క్లాస్‌మేట్స్, సెక్షన్ మేట్స్‌కూడా హైస్కూల్లో. ఎస్. ఎస్. ఎల్. సి. వరకు ఒకే సెక్షన్‌లో వచ్చారు. స్కూల్లో ఆమె లెక్కల నోట్స్ తన కిచ్చేది. "దుష్యంత్! ఇంగ్లీష్‌లో నీవు జెమ్‌వి, నీ నోట్స్ ఇయ్యి" అనేది. ఇచ్చేవాడు. శనివారం కూడా స్కూల్ ఉండేది ఎస్. ఎస్. ఎల్. సి. లో. "దుష్యంత్! మాటినీకి పోదాం" అనేది. 'సై' అనేవాడు తను. ఇద్దరూ సినిమాలకు వెళ్ళేవారు. ఒక్కోసారి ఫస్ట్‌షోకికూడా పోయేవారు. తన క్లాసుమేట్ క్రిష్ణగాడి సిస్టర్ జయంతికూడా తమ సెక్షనే. ఆమె ఇంటికి వచ్చేది ధర్మవతి. తనూ వెళ్ళేవాడు. అక్కడ ప్రోగ్రాం వేసుకునే వారు. ఒక్కో రోజు బీచ్‌కి. ఒక్కో రోజు పిక్చర్‌కి.

తమ పరిచయం వృద్ధి పొందింది. ఇద్దరూ ఎస్. ఎస్. ఎల్. సి. పాసయ్యారు. పి. యు. సి. లోకూడా ఒకే గ్రూప్ ఇద్దరిదీ. తనది మెన్స్ కాలేజి. ధర్మవతిది విమెన్స్ కాలేజి. సాయంత్రం కాలేజి అయ్యాక కలుసుకునేవారు. అప్పుడుకూడా పిక్చర్స్ చూసేవారు.

నిజంగా ధర్మవతి పట్ల తనకి ఏ అభిప్రాయమున్నదో అని ప్రశ్నించుకునే వాడు. ఆమెను తను అభిమానిస్తున్నాడు. అది నిజమే. ఆమె చాలా అందమైనది. అంత అందం ఆ రోజుల్లో ఏ అమ్మాయికీ లేదు. ఆమెను ప్రేమించటం మొదలు పెట్టాడు. నిజంగా ధర్మవతి కనిపించక పోతే అదోలా ఉండేది తనకు. పార్క్‌లో మౌనంగా కూర్చున్న తనని— "ఏమి టాలోచిస్తున్నావ్, దుష్యంత్, అంత దీర్ఘంగా?" అనేది ధర్మవతి. "ఏం లేదులే" అనేవాడు తను.

ఆల్జీబ్రా సాల్వ్ చేస్తున్నప్పుడు స్టెప్స్ తప్పయితే రాంబాబు అనేవాడు: "నీ దృష్టి ఇక్కడెందుకు ఉంటుంది. . . ధర్మవతి మీదకు పోయి ఉంటుంది." నవ్వేవాడు. తను మౌనంగా ఉండిపోయే వాడు. హృదయంలో మధుర భావాలు చెలరేగేవి.

ఒక రోజు తను క్లాస్ నుండి వస్తున్నాడు. దూరంగా విమెన్స్ కాలేజీ జంక్షన్‌లో రాంబాబు ధర్మవతితో మాటాడుతున్నాడు. ధర్మవతి నవ్వుతూంది. తన మనస్సులో బాధ ప్రారంభమయింది. ధర్మవతి వేరెవ్వరితో మాటాడినా సహించడు తను. కాని, తన ఆప్త మిత్రుడు. . .

రాంబాబు అనేవాడు: "నేను జె. కె. హైస్కూల్లో చదివేవాడిని. మీ గూర్చి తెలియదు. పి. యు. సి. లో ఆమెను చూడలేదు. కాని, ఆమె బ్యూటీ గూర్చి విన్నాను. వాళ్ళ తమ్ముడు భాస్కరం తెలుసు నాకు. అతను పి. యు. సి. ఇప్పుడు. భాస్కరం క్రికెట్ ప్లేయర్. నేను కెప్టెన్‌కద? అతని ద్వారా. . ." ఇంకా చెపుతున్నాడు రాంబాబు. వినదలుచుకోలేదు తను. భాస్కరం ద్వారా వాళ్ళ సిస్టర్ ధర్మవతి పరిచయమైనదట. "ధర్మవతి నిజంగానే అందంగాఉంటుంది కదూ?" అనేవాడు. అతనికేం? ఉన్నవాడు.

'ధర్మవతి మన స్నేహాన్ని విస్మరిస్తుందా' అని ప్రశ్నించుకునే వాడు. తను. "షేక్స్‌పియర్ డ్రామా 'సింబలిన్' లో ఇమోజిన్ లా ఉంటుంది కదండీ ధర్మవతి?" అనేవాడు రాంబాబు. తమ డిగ్రీలో ఇంగ్లీష్ డ్రామా 'సింబలిన్'. అంత అందంగా ఉంటుంది, నిజమే. "మీ ఆవిడ. . ." అనే వాడు రాంబాబు. ఆ సంఘటన జరిగిన వద్దనుండీ ఇంత చనువుగా ఉన్న రాంబాబు మీద అనుమానం వేసింది. రాంబాబుకూడా ధర్మవతిని ప్రేమిస్తున్నాడా? ఏమో?

ఫస్టియర్ వేసవి సెలవులలో తమ మామయ్యగారి ఊరు వెళ్ళాడు తను. ఓ రోజు మధ్యాహ్నం నిద్ర లేచి నూతి వద్ద ముఖం కడుక్కుంటూంటే, "ఏమండీ బావగారూ! నిద్ర లేచారా?" అనే కంఠం వినబడి వెనుతిరిగాడు. విశాల నయనాలతో సన్నగా, పొడవుగా ఒక అమ్మాయి తననే చూస్తూంది. ఆమె తన మామయ్య కూతురు, శారద.

తను అక్కడ ఉన్న నాలుగు రోజులు తనతో చనువుగా తిరిగింది శారద. గార్డెన్స్‌కి వచ్చేది. పిక్చర్స్‌కి వచ్చేది. తనను విడువకుండా తిరిగేది. 'బావా!' అనేది.

**కె. సుందరకుమార్**

"బావా! చదువయ్యాక ఏం చేస్తావ్?" అంది ఓ రోజున.

"ఏం చేస్తాను. ఎమ్. ఎస్‌సి. చదువుతాను. తరవాత ఏదో ఉద్యోగంలో ప్రవేశిస్తాను" అన్నాడు.

"అది కాదు, బావా."

"ఏమిటి?" అన్నాడు తను. అదేదో విషయం ఉందని తెలిసి.

"బా. . .వా. . ." సిగ్గుతో ముఖం దించుకుంది.

బుగ్గలు ఎరుపెక్కాయి.

తెలిసిపోయింది ఆమె మనసులో ఏముందో. కాని. . . తిరిగి వచ్చేప్పుడు ఒంటరిగా శారదతో అన్నాడు:

"చూదాంలే. చదువై ఒక దారిని పడనీ" అని.

అవును, శారద తనను ప్రేమిస్తూంది ఆమె తన మామయ్య కూతురు. ఆమెను చేసుకుంటే సుఖపడ వచ్చును. కాని, ధర్మవతి మాటేమిటి? ఆమె, తను స్నేహితులు. క్లాస్‌మేట్స్. అయినా ఆమె అభిప్రాయం? ధర్మవతి అభిప్రాయానికేముంది?

సెకండియర్ వచ్చింది. చదువు మామూలుగా సాగుతూంది.

"ఫ్రెండ్! నీవు క్రికెట్‌లో చేర రాదూ?" అన్నాడు రాంబాబు. తను వద్దన్నాడు. ధర్మవతి తమ్ముడు భాస్కరం క్రికెట్ కెప్టెన్. రాంబాబు టెన్నిస్ కెప్టెనయ్యాడు. భాస్కరం తనకూ స్నేహితుడే కాని, రాంబాబుకి అతనితో స్నేహం హెచ్చు. రాంబాబు భాస్కరం ఇంటికి పోయేవాడు. ధర్మవతితో మాటాడేవాడు. 'రాంబాబు ధర్మవతితో మాటాడుతాడు. పిక్చర్స్‌కి వెడతాడు' అనుకునేవారు కాలేజీలో. తనకు కోపం ఆగేది కాదు. కాని,రాంబాబు తన మిత్రుడు.

"పిక్చర్స్‌కి పోదాం పద, దుష్యంత్" అని బలవంతం చేసేవాడు రాంబాబు. ఒక్కో రోజు రాత్రి స్టడీస్ ఆలస్యమయితే వాళ్ళింట్లోనే భోజనం చేసి పడుకునేవాడు. భోజనం చేసి కొంచెం సేపు చదువుకుని సెకండ్ షో పిక్చర్‌కి పోయేవారు.

"ధర్మవతి బాగా చదువుతోందండీ. పరీక్షలు దగ్గరి కొచ్చాయి కద" అనే వాడు. ఆమె ఎలా చదువుతే తన కేం? ధర్మవతిని తక్కువగా ఊహించలేదు తను. ఉన్నవాడని అతనికి ఆకర్షితురాలవలేదు తను. తన ఊహలకు తనకే భయం వేసింది. "గాలం వేశాడు, గురూ! ధర్మవతికీ, వాడికీ జత కుదిరింది" అని కామెంట్స్ వచ్చేవి. తను మనసులో బాధ పడేవాడు— రాంబాబుని, ధర్మ

పతిని గూర్చిన అర్జిన ఆలోచనలకి. తన మనసు కుతకుత లాడేది.

ఆ విషయాలెలా ఉన్నా తన గూర్చి పాటు పడేవాడు రాంబాబు. ఇద్దరూ ప్రోగ్రెస్సు పోర్ట్సు చేసుకునే వారు. చదివేవారు. "ధర్మావతి చాలా మంచి పిల్లంటి! ఆమె నెలాటి వాడు కట్టు కుంటాడో కాని అదృష్టవంతుడు" అనే వాడు రాంబాబు. తను ప్రశ్నార్థకంగా అతని ముఖంలోకి చూసేవాడు.

"నీ కేం? నీవే ఆ అదృష్టవంతుడవు కాకూడదూ?" అనేవాడు నవ్వుతూ.

తను చాలా ఉదాసీనంగా ఉండేవాడు. పబ్లిక్ పరీక్షలు దగ్గరగా వచ్చేస్తున్నాయి. మామూలుగా చదువు సాగేది. ధర్మావతి కలిసేది అప్పుడప్పుడు తనని. ఎప్పుడూ 'రాంబాబు నీకు తెలుసా?' అని అడగ లేదు తను ధర్మావతిని. అలా అడగలేక పోయాడు తను.

పరీక్షలు వారం రోజులున్నాయి. మంచి పిక్చర్ వచ్చింది. చూశాడు. తనొక్కడూను. చాలా సెన్సిటివ్ పిక్చరది. స్టోరీలో వాల్యూ ఉంది. హీరో ఒక అమ్మాయిని ప్రేమిస్తాడు. ఆ అమ్మాయి, అతను గంభీరంగా ఉంటారు. ఇద్దరికీ ఒకరిపై ఒకరికి ప్రేమ ఉంది. ఇంతలో వేరొక అమ్మాయి అతణ్ణి ప్రేమిస్తుంది. ఇద్దర్లో ఎవర్ని చేసుకోవటమో సమస్య అవుతుంది అతనికి. మథన పడతాడు చివరలో, తనను ప్రేమించిన అమ్మాయిని లక్ష్యపెట్టక తను ప్రేమించిన అమ్మాయిని ధ్యానిస్తాడు. ఇదీ పిక్చర్ కథ.

తన మనసు వికలమైంది. తనూ అంతే. ధర్మావతిని చిన్నతనం నుండీ ప్రేమించాడు. తనను శారద ప్రేమిస్తోంది. ఎవర్ని చేపట్టటం? తల తిరిగిపోయింది.

దగ్గర్లోనే ఉన్న ఆంజనేయస్వామి గుడికి వెళ్ళాడు తను. అక్కడకు భాస్కరం, రాంబాబు, ఫ్రెండ్స్ వచ్చారు. వెళ్ళిపోతూంటే— "భాస్కరం! ఒకమాట" అని పిలిచాడు తను. భాస్కరం తనతో వచ్చాడు. తను "నీ సిస్టర్ని నా సిస్టర్గా చూస్తున్నా. కాని కొందరేమో. . ." అన్నాడు. భాస్కరం అర్థం చేసుకున్నాడు. అయినా తన మనసులో బాధ తీరలేదు.

రెండు రోజులయిన తరవాత రాంబాబు ఇంటికి వెళ్ళాడు తను. "నేను పుకారు లేవదీశానని ఎందుకన్నావ్? రాంబాబుతో నిజంగా నీవు భాస్కరం సిస్టర్ని— నీ సిస్టర్లా చూశావా?" అన్నాడు. మాటాడక వచ్చేశాడు తను.

తను భాస్కరంతో ఆ మాట అన్నా తరవాత ధర్మావతి తనతో మాట్లాడటం మానివేసింది. చాలా సార్లు రాంబాబు భాస్కరం వాళ్ళింటికి వెళ్ళాడు.

రిజల్ట్సు తెలిశాయి. పాసయ్యారు తను, రాంబాబు. ధర్మావతి కూడా పాసయింది.

అతన్ని కలిసిన ఆ రోజు అన్నాడు రాంబాబు:

"దుష్యంత్! మనిద్దరి మధ్య భేదాభిప్రాయాలు రాకూడదు. నీవు ధర్మావతిని సిస్టర్లా చూడలేదని నా నమ్మకం. అలానే అయితే ఆమె పై కవిత లెందుకు వ్రాశావు? ఆమెమీద మనసెలా పెంచు కున్నావ్? ఈ పని చేసినందు వల్ల కొంత నష్టపోయావు. బి. ఎస్‌సి. మనిద్దరం పాసయిన వెంటనే, ఎమ్. ఎస్‌సి. చదివించి నాన్న స్టేట్స్‌కి పంపుదా మనుకున్నారు. . ."

ఇంకా చెబుతున్నాడు రాంబాబు. తనేలా సమాధానం చెప్పాలి రాంబాబుకి? ఒక వేళ రాంబాబు ధర్మావతిని ప్రేమిస్తున్నాడేమో, అతని మార్గానికి అడ్డు రాకూడదని ఆవిడను సిస్టర్లా భావిద్దామని అనుకున్నాడు తను. కాని, తరవాత తెలిసింది— అది తనకు సాధ్యం కాదనీ, జన్మలో ధర్మావతిని సిస్టర్గా చూడలేదనీ. ఆమె తన ప్రేయసి మాత్రమే. ధర్మావతి ఎంత బాధ పడుతుందని! ధర్మావతి శపథం పట్టినట్లు కనిపించటం మానేసింది తనకి.

ఒకవేళ స్నేహితుని కోసం త్యాగం చేసినా ఆమెను స్నేహితురాలుగానే సాగ నంపవలసి వచ్చును కదా? మరి తను ఎందుకలా చెప్పాడు భాస్కరానికి- ఆమెను తను సిస్టర్లా చూస్తున్నాడని? అసలు సిస్టర్స్‌కి, ప్రేయసికి భేదం తెలుసా తనకి? ప్రేమించి లేదంటాడా తను? అవును, తను స్వార్థజీవి. శారదని చేసుకుందాం అని నిర్ణయించుకుని, జీవితంలో ఇద్దర్ని ప్రేమించడం, కట్టుకోవటం సాధ్యం కాదని, ప్రేమించిన ధర్మావతిని సోదరిగా చూడగలదేమో అని తనలా చెప్పాడు. కాని, తను నిజంగా తనకి ఆత్మద్రోహం చేసుకున్నాడు. తనను తానే మోసగించుకున్నాడు. ప్రేమించిన ఆమెను తను ఎప్పటికీ సోదరిగా చూడ లేడు. తన అంతరాత్మ ఎదురు తిరుగుతుంది.

ఫైనలియర్ కూడా అయిపోయింది. తనకు, రాంబాబుకు సెకండ్ క్లాస్ వచ్చింది. ధర్మావతి మామూలుగానే పాసయింది. తరవాత రాంబాబు ఎమ్. ఎస్‌సి. లో చేరాడు. తను బి. ఇ. కి వెళ్ళాడు. ధర్మావతి బి. ఇడి. కి అప్లై చేసింది.

బి. ఇడి. పాసై ఊర్లోనే బాంక్‌లో ఉద్యోగం చేస్తోందని తెలిసింది తనకి, రాంబాబుకీ. రాంబాబు ఎమ్. ఎస్‌సి. పాసై ఒక ప్రైవేట్ కాలేజీలో లెక్చరర్‌గా ఉన్నాడు, హైదరాబాదులో. తను బి. ఇ. ఫస్ట్ క్లాస్‌లో పాసై రెండు నెలలు ఖాళీగా ఉన్నాడు. శారద బి.ఎస్‌సి. పాసయిందని తెలిసింది. ఇంతలో డైరెక్ట్‌గా అసిస్టెంట్ ఇంజనీర్ ఆఫ్ టెలికమ్యూనికేషన్' కి సెలక్షన్‌కి రమ్మని పిలుపు వచ్చింది. సెలక్టయాడు. ట్రెయినింగ్ ఆర్డర్స్ వచ్చాయి. ట్రెయినింగ్ అయి నాక, కలకత్తాలో వేశారు తనని.

ట్రెయిన్ ఆగింది ఏదో స్టేషన్‌లో. కాఫీ తాగి, ఫిలిమ్‌ఫేర్ తీసుకుని, మరల వచ్చి సీట్లో కూర్చున్నాడు దుష్యంత్. రెండు మూడు పేజీలు తిరగ వేశాడు. ఏమీ తోచలేదు. మళ్ళీ ఆలోచనలో పడ్డాడు.

ధర్మావతికి వివాహమయింది. బాంక్ ఉద్యోగానికి రాజీనామా ఇచ్చి వెళ్ళి పోయింది. భర్త డాక్టర్— ఇంగ్లండ్‌లో పని చేస్తున్నాడు. వాళ్ళ చుట్టమేనట. వరసకి 'బావ' అవుతాడట. ఓ రోజున ఆఫీసయిన తరవాత తాను ట్రామ్ కోసం నిలబడ్డాడు. తన పక్కనే ఒక పొడుగాటి వ్యక్తి తననే చూస్తున్నాడు. "హలో!" అన్నాడు. రిసీవ్ చేసుకున్నాడు తను. "గుర్తుపట్టారా నన్ను? రాంబాబు కజిన్ నేను. పురుషోత్తమ్ నేను" అన్నాడు. మాటల మధ్య రాంబాబు ఎక్కడ అన్నాడు తను. వెంటనే అతను జేబులోంచి విజిటింగ్ కార్డు తీసి, అది తన అడ్రెస్ అన్నాడు. ". . . బాంక్, బాంద్రా, బొంబాయ్" అని ఉంది. వెంటనే రాంబాబుకి లెటర్ వ్రాశాడు వివరాలతో. జవాబు వచ్చింది— ఎలా ఉన్నట్లు, వీలైతే నెల రోజులు సెలవు తీసుకుని రమ్మని. అలా అని ఊరుకున్నాడు తను. లెటర్ మీద లెటర్ వ్రాశాడు రాంబాబు, రమ్మని. సెలవు పెట్టి బొంబాయి బయలుదేరాడు తను.

ట్రెయిన్ బొంబాయి చేరుకుంది. లెదర్ బాగ్, సూట్‌కేస్ తీసుకుని దిగాడు దుష్యంత్. దూరంగా నీలం చీరతో నిలుచుంది ఒక యువతి. గాగుల్స్ పెట్టు కుంది. పక్కన అయిదేళ్ళ కుర్రాడు నిలు చున్నాడు. దగ్గరగా వెళ్ళాడు దుష్యంత్. ఆ యువతి అతన్ని చూచింది.

"దుష్యంత్!" అంటూ గాగుల్స్ తీసింది.

"ధర్మావతీ!" అన్నాడు దుష్యంత్.

"ఎప్పుడు రావటం, ఎక్కడనుండి" అంది.

"డి. ఇ. టి. గా కలకత్తాలో ఉంటున్నా ఫోన్స్‌లో. రాంబాబుని చూద్దామని. అత నిక్కడ అకౌంటెంట్" అన్నాడు తను.

"మా వారిక్కడ డి. ఎమ్. ఓ. ఇంగ్లండ్‌నుండి వచ్చి ఇక్కడ ప్రాక్టీస్ పెట్టారు. భాస్కరం పూనాలో ఎస్. ఐ. గా ఉన్నాడు. ట్రెయినెక్కింది ఇప్పుడే! పద, పోదాం" అంది.

"రాంబాబు?" అన్నాడు తను.

"రాంబాబు ఎక్కడకు పోడులే. ముందు పద" అన్నది.

టాక్సీలో బయలుదేరారు. ఒక బంగళా పోర్టికోలో ఆగింది కారు. మేడ మీదకు పోయారు. స్నానం చేసి, డైనింగ్ హాల్లోకి వెళ్ళాడు దుష్యంత్.

"మా వారు క్యాంప్ వెళ్ళారు. వీడు మా వాడు, శరత్" అంది.

భోజనం చేసి పడుకున్నాను. నిద్ర లేచేసరికి కాఫీ కప్‌తో ప్రత్యక్షమయింది ధర్మావతి, వెళ్ళిపోతూంటే పిలిచాడు ధర్మావతిని.

"ఉద్యోగం మానేసే వేమి" అన్నాడు.

"మా నేయక ఏం చేయను, దుష్యంత్? నాన్న పెళ్ళి చేసుకోమన్నారు. మా బావ లెటర్ వ్రాశాడు. వెంటనే నన్ను ఢిల్లీ పంపారు. అక్కడ మా బ్రదర్ ఫారిన్ పంపాడు. పాస్‌పోర్ట్ మీద" అంది.

"నేను నీ పట్ల ద్రోహం చేశాను ధర్మా!" అన్నాడు తల వంచుకుని.

ధర్మావతి నవ్వింది.

[illegible]

[illegible]

— [illegible]

# 'సీతారామరాజు' బుర్రకథ

వంశం కళాకారుల నిలయం అయితే ఆ ఇంట నడయాడే పసికూన నోటిలోకూడా సంగీ, కళాలక్ష్మి ఓ అని పలుకుతుంది. నిజమే మరి. తూర్పు గోదావరి జిల్లా ఆర్యావటం గ్రామంలోపుట్టిన కుటుంబం కళకే అంకితం కావడం, వారి ఇల్లే కళాకేంద్రం కావడం పెట్టి పుట్టిన భాగ్యమే. ఆర్యావటం గ్రామానికి చెందిన మర్ల రామచంద్రం దంపతులు సంగీత, కళోపాసకులు. నాటకరంగానికి జీవితాలను అంకితం చేసిన మహనీయులు. వారి సంతానమే భద్రకాళి, జోగయ్యశాస్త్రి, సీతారామస్వామి.

శ్రీమతి భద్రకాళి ఇటీవల 'కళాభారతి' ఆధ్వర్యంలో వాణీమహల్‌లో విప్లవవీరుడు అల్లూరి సీతారామరాజు బుర్రకథ చెప్పింది. ఆమె కథను వింటూంటే బుర్రకథా పితామహుడుగా తెలుగుదేశాన్ని తన గొంతుతో మారు మ్రోగించిన నాజర్ వినిపిస్తాడు. అదే చెప్పింది శ్రీమతి భద్రకాళి— నాజర్ గురుతుల్యులని.

రాగం, తాళం, రసపోషణలతో, కథాసంవిధానానికి తగిన హావభావప్రదర్శనతో ఆ విప్లవవీరుని చరితను నవరసభరితంగా చెప్పడం, చెప్పి మెప్పించి ప్రేక్షకులను రసవాహినిలో ముంచెత్తడం ఈమె పెట్టి పుట్టిన విద్య.

బ్రిటిష్ కపాయితనాన్ని ఎదిరించిన సీతారామరాజు మాటలను బాకుల్లా, పిడుగుల్లా చెప్పడం ఆ చిన్నారికే చెల్లింది. చక్కని గాత్రం, శాస్త్రపోషణతోకూడిన ఈ బుర్రకథాదళాన్ని మనసారా అభినందిస్తున్నాము. జానపద కళారూపాల కోసం కృషి చేస్తూన్న భద్రకాళి బృందాన్ని ప్రోత్సహించవలసిన అగత్యం చాలా ఉంది.

ప్రథమంలో 'కళాభారతి' అధ్యక్షులు శ్రీ పి. బ్రహ్మయ్యగారు ఆహూతులకు స్వాగతం పలికి, భద్రకాళి బృందాన్ని అభినందించి, శాలువలతో వారిని సత్కరించారు.

ప్రధాన అతిథులు, ప్రముఖ సినీ నటీనటులు శ్రీ కృష్ణ, శ్రీమతి విజయనిర్మలగార్లను "కళాభారతి" పక్షాన మాలలతో, శాలువలతో సన్మానించారు. శ్రీ కృష్ణ, శ్రీ బ్రహ్మయ్యగార్లు ప్రసంగించారు. శ్రీమతి రామలక్ష్మి వేదిక నలంకరించారు.

శ్రీ మిక్కిలినేని రాధాకృష్ణమూర్తి జానపద కళలు, బుర్రకథ సంప్రదాయాలను వివరించారు. శ్రీ ఎల్లోరా బుర్రకథాబృందం కృషిని అభినందించారు.

శ్రీ నరసింహారావు వందన సమర్పణ చేశారు.

—ఎల్లోరా



'కళాభారతి' ఆధ్వర్యంలో బుర్రకథ చెప్పిన మర్ల జోగయ్యశాస్త్రిని, శ్రీమతి భద్రకాళిని శ్రీ పి. బ్రహ్మయ్య అభినందిస్తున్నారు. పక్కన ఉన్నవారు సంఘ నిర్వాహకులు శ్రీ కె. ఎస్. ఆర్. నరసింహారావు.

---

"అదేం కాదు. నేను నమ్మలేదు. అప్పట్లో నీవు నన్నా ప్రేమిస్తున్నావని తెలుసు. రాంబాబు కేవలం స్నేహితుడు మాత్రమే. భాస్కరం ఫ్రెండట. నీవు అతన్ని అనుమానించావని పసి గట్టాను. మా ఇంటికి వచ్చి ఏడ్చాడు. నిన్నూ, నన్నూ గూర్చి అనలేదన్నాడు. నీవు ఆత్మవంచన చేసుకున్నావు. స్నేహితుడు ప్రేమించిన అమ్మాయిని వేరొక స్నేహితుడు, అందునా ముఖ్య స్నేహితుడు కాంక్షించడు. సరదాగా ఆనందంగా నిన్ను కవ్వించాడట. అందునా మనిషికి ద్వంద్వాలి ప్రాయా లుండవు. సోదరి సోదరిగాను, ప్రియురాల్ని ప్రియురాలుగాను చూస్తాడు మనిషి. కాని, రెండు విధాల బయట ఒకలా లోన ఒకలా ఉండదు. అలా రెండభిప్రాయాలు నీకున్నాయంటే నేను నమ్మలేదు. కాని, నీ వలా అనగానే నాకు కష్టం కలిగింది. ఇంతలో బావ సంబంధం వచ్చింది" అంది.

"ఐయామ్ రియల్లీ వెరీ వెరీ సారీ, ధర్మా! రాంబాబు కోసం. . ."

మళ్లీ నవ్వింది ధర్మావతి.

"పిచ్చివాడా! ఒకరి కోసం, వేరొకరు ప్రేమను త్యాగం చేయలేరు. రాంబాబు నన్ను కోరలేదు. మన హిస్టరీ తెలుసతనికి. మనిద్దర్నీ కలపాలని ప్రయత్నించాడు" అంది.

నిజమే, తనకు సోదరతుల్యుడు రాంబాబు. హృదయ సఖి ధర్మావతి. ఇద్దర్నీ అర్థం చేసుకోలేదు తను.

మర్నాడు బయలుదేరాడు దుష్యంత్. రాంబాబు వద్దకు వెళ్లాలి.

శారద కింకా పెళ్లి కాకపోతే ఆమెనే తను పెండ్లాడాలి. తనను ప్రేమించింది. పిచ్చిపిల్ల!

అడ్రెస్ ప్రకారం రాంబాబు బంగళా చేరి, కాలింగ్ బెల్ నొక్కాడు. తలుపు తెరిచి అమాంతం వాటేసుకున్నాడు తనను. లోపలకు వచ్చా రిద్దరూ. ఇంతలో లోపలనుండి ఒక యువతి వచ్చింది. దుష్యంత్ అటే చూస్తున్నాడు.

"వీడు మా ప్రాణమిత్రుడు, దుష్యంత్" అన్నాడు.

"నమస్తే" అంది ఆ అమ్మాయి. దగ్గరగా వచ్చింది.

దుష్యంత్ తల ఎత్తిచూచి శిలా ప్రతిమ అయ్యాడు. ఆమె శారద!

తల తిరిగి పోతూంది తనకి. "నేను ఆఫీస్‌కి వెళ్లి, సాయంత్రం నాలుగు రోజులు సెలవు పెట్టి వస్తా. సాయంత్రం మన ప్రోగ్రాం ఏర్పాటు చేసుకుందాం. శారదా, వీడు జాగ్రత్త!" అన్నాడు రాంబాబు ఆఫీస్‌కి వెడుతూ.

బలవంతం మీద భోజనం చేశాడు. తనక్కడ ఉండరాదు. తన మనసుకు ఎక్కడకు వెళ్లినా శాంతి లేదు.

క్రమంగా సూట్‌కేస్ సర్దాడు. టాయిలెట్ అయ్యాడు.

సూట్‌కేస్, లెదర్‌బాగ్ తీసుకుని బయటకు వచ్చాడు రోడ్డుమీద నించున్నాడు.

"సార్!" తల తిప్పాడు. ఒక అబ్బాయి ఒక కవరు తెచ్చి దుష్యంత్ చేతికి ఇచ్చాడు. "అమ్మగారు మీ కిమ్మన్నారు" అన్నాడు.

స్టేషన్ చేరి టికెట్ కొనుక్కుని, వెయిటింగ్‌రూమ్‌లో కూర్చుని మెల్లగా కవర్ చించి ఉత్తరం చదవటం మొదలెట్టాడు.

"బావా,

నా మీద కోపం పోలేదా నీకు? నిన్ను ప్రేమించాను, బావా. నీ మీద ఆశలు పెంచుకున్నాను. ఊహలు అల్లుకున్నాను. నిన్ను చేసుకోవాలనుకున్నాను. కాని, మా వాళ్లెవ్వరూ నీతో— నా పెళ్లి ఒప్పుకోలేదు. నీ వద్దకు వచ్చేదామని అనుకున్నా. కాని నీవు, అత్తయ్య ఏమంటారో అని, నా సాహసం మన్నించరేమో అని అనుకున్నా. పెద్దల పరువు ప్రతిష్ఠలు పాడు చేయలేక నోరు మూసుకున్నా. నీవు సాహసించలేదేం, బావా?

ఈయనతో నాకు వివాహమయింది మంచివారే. మీ ఇద్దరి ఫొటో చూసి నీ స్నేహితులని తెలుసుకున్నాను.

మన్నించు, బావా, నన్ను.

ఇట్లు,
శారద." ★